క్లుప్తంగా

ఆనందోత్సాహాలతో సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న చిన్నారులు, ఉపాధ్యాయులు

యానాం: నియోజకవర్గ పరిధిలోని మెట్టకూరు ప్రభుత్వ పాఠశాలలో శనివారం సంక్రాంతి సంబరాలను ఆనందోత్సాహాలతో నిర్వహించారు. చిన్నారులు సంప్రదాయ దుస్తులను ధరించి పాఠశాలకు వచ్చి రంగోళి, భోగి మంటలు, హరిదాసు వేషధారణ, ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.వెంకటరమణ, ఎం.నాగరాజు, పి.జయపాల్, కె.శ్రీరాములు, ఎస్.వెంకటరమణ పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలకు వితరణ



పేద కుటుంబాలకు నిత్యావసర సరకుల కిట్లు అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక దుడ్డివారి అగ్రహారంలోని విశ్వ బ్రాహ్మణ కమ్యూనిటీ భవనంలో నిరుపేద విశ్వ బ్రాహ్మణ కుటుంబాలకు నిత్యావసర వస్తువుల కిట్లను శనివారం సాయంత్రం పంపిణీ చేశారు. రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ యువజన సంఘం అధ్యక్షుడు ఆవుపాటి వేణుగోపాల్, జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు వరదా సుబ్బలక్ష్మి, జిల్లా క్రమశిక్షణా సంఘం అధ్యక్షుడు దార్ల పాపయ్యాచారి, మున్సిపల్ కౌన్సిలర్ కట్టోజు సన్నయ్యదాసు తదితరుల చేతుల మీదుగా నిత్యావసర సరకులను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు కోచూరి చిదంబరాచారి, బొల్లోజు మణి శ్రీకాంత్, ర్యాలి రాజశేఖర్, నల్లమాటి నాగబాబు, కట్టోజు సత్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రామమాధవ్‌ను కలిసిన ‘కేఆర్‌ఎస్‌ఎస్’ బృందం



రామమాధవ్‌కు వినతి పత్రం అందిస్తున్న కేఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధుల బృందం

అమలాపురం టౌన్: న్యూఢిల్లీ నుంచి అమలాపురానికి వచ్చిన జాతీయ బీజేపీ నేత రామ మాధవ్‌ను కోనసీమ రైల్వే సాధన సమితి (కేఆర్‌ఎస్‌ఎస్) ప్రతినిధుల బృందం శనివారం కలిసి కోటిపల్లి–నర్సాపురం రైల్వే లైన్ నిర్మాణంపై వినతి పత్రం అందించారు. కోనసీమ రైల్వే లైన్ త్వరితగతిన పూర్తయ్యేలా కృషి చేయాలని కేఆర్‌ఎస్‌ఎస్ బృందం విజ్ఞప్తి చేసింది. రామ్‌మాధవ్‌ను కలిసిన వారిలో కేఆర్‌ఎస్‌ఎస్ అధ్యక్షుడు డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, పోలిశెట్టి శివాజీ తదితరులున్నారు.

348 మద్యం బాటిళ్ల పట్టివేత

ఐ.పోలవరం: మండలంలోని పాతయింజరం చెక్ పోస్ట్ వద్ద శనివారం నిర్వహించిన వాహన తనిఖీల్లో భాగంగా అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న కారును పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ముమ్మిడివరం సీఐ కొండయ్య, ఎస్ఐ రాజేష్ సిబ్బందితో కలిసి నిర్వహించిన తనిఖీల్లో యానాం నుంచి గుంటూరు వెళుతున్న కారులో మొత్తంగా 348 మద్యం బాటిళ్లను గుర్తించి పట్టుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కారును, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కాట్రేనికోన: మండలంలోని పల్లం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 254 మద్యం బాటిళ్లను కాట్రేనికోన పోలీసులు, ఎస్ఈబీ(సెబ్) పోలీసులు ఆకస్మికంగా దాడి చేసి పట్టుకున్నారు. దాడిలో కాట్రేనికోన ఎస్ఐ నాగేశ్వరరావు, ఎస్ఈబీ(సెబ్) ఎస్ఐ మల్లాడి వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. యానాం నుంచి మద్యంను అక్రమంగా తరలించి పల్లంలో అమ్మకాలు చేస్తున్న వారిపై కేసు నమోదు చేశామని కాట్రేనికోన ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు.

నేటి నుంచి కోనసీమ సంక్రాంతి సంబరాలు

అమలాపురం టౌన్: స్థానిక నల్ల వంతెన–ఎర్ర వంతెన మధ్య ఉన్న హౌసింగ్ బోర్డు కాలనీ రోడ్డు చెంత ఆదివారం నుంచి కోనసీమ సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు హైదరాబాద్, విశాఖపట్నం మెట్రో కెమ్ లిమిటెడ్ కంపెనీల అధినేత డాక్టర్ నందెపు బాలాజీ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తొలిరోజు భోగి మంటలు, కత్తులు లేని కోడి పందేలు నిర్వహిస్తామన్నారు. సంక్రాంతి రోజున మహిళలకు కోనసీమ స్థాయి ముగ్గుల పోటీలు, కనుమ రోజున ప్రభల తీర్థాన్ని నిర్వహిస్తామన్నారు. సమావేశంలో మెట్ల రమణబాబు, చిక్కాల గణేష్, అల్లాడ శరత్‌బాబు, పల్లంరాజు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలకు పెద్దపీట

- రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్
- కొమరగిరిపట్నంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఆధునీకరణకు శంకుస్థాపన



సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఆధునీకరణ పనులకు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి విశ్వరూప్. చిత్రంలో ఎంపీ అనురాధ, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. కొమరగిరిపట్నంలోని వెంకన్నచెరువు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఆధునీకరణకు ఎంపీ అనురాధ, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌తో కలిసి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ కొమరగిరిపట్నం పంచాయతీ పరిధిలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఆధునీకరణతో ఎన్నో ఏళ్లుగా ఉన్న తాగునీటి సమస్యకు మోక్షం లభించనుందన్నారు. అలాగే కొమరగిరిపట్నంలోని ప్రధాన రహదారి ఆధునీకరణకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఎంపీ అనురాధ మాట్లాడుతూ రూ.4.95 కోట్ల సీఎస్ఆర్ నిధులతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఆధునీకరణ పనులు చేపట్టామన్నారు. మరో రూ.87 లక్షల ఎంపీ ల్యాండ్స్, సీఎస్ఆర్ నిధులతో పలు అభివృద్ధి పనులు చేశామన్నారు. చెరువు ఆధునీకరణకు నిధులు మంజూరు చేయించిన మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధకు అమలాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు కృతజ్ఞతలు తెలిపారు. గోడి బాలికల గురుకులంలో ఓహెచ్ఆర్ ట్యాంక్ నిర్మాణానికి మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ, సర్పంచ్ తోట శ్రీదేవి, ఎంపీటీసీ సభ్యుడు మామిడిశెట్టి శ్రీనివాసరావు, కాంగ్రేసుల వాణి అచ్యుతం, సొసైటీ చైర్మన్లు అల్లూరి సురేష్‌రాజు, గుర్రం బాబులు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కడలి లక్ష్మణరావు, బాబురావు, టీపీసీ మెంబర్ కుడుపూడి శ్రీను, అలయ చైర్మన్ నామన సిద్ధాంతి, ఉప సర్పంచ్ గుర్రం రెడ్డినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కందికుప్ప పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 2005-06 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు



కొమరగిరిపట్నం హైస్కూల్లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 2001-02 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

అల్లవరం: కొమరగిరిపట్నం ఉన్నత పాఠశాలలో 2001-02 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాల ఆవరణలో శనివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించుకున్నారు. హెచ్‌ఎం ఎం.సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అప్పటి గురువులు గుగ్గిళ్ల సత్యనారాయణ, ఎ.వీరాంజనేయులు, కోరుమిల్లి సత్యనారాయణాచార్యులు, దుర్గాప్రసాద్, అరధాని వరప్రసాద్, సుంకర నాగేశ్వరరావు, కాట్రు ప్రేమలతలను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్య మానసిక వికాసానికి తోడ్పడుతుందన్నారు. విద్యతోనే సమాజాభివృద్ధి, వ్యక్తి అభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఆట పాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో భూపతిరాజు కృష్ణంరాజు, తాడల నాగబాబు, యనమదల ప్రభాకర్, ఆకుల తలుపులరావు, సలాది మాధవి తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: కందికుప్ప జిల్లా ప్రజాపరిషత్ పాఠశాలలో 2005–06లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు వడ్డి శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం అదే పాఠశాలలో జరిగింది. 13 ఏళ్ల తరువాత కలుసుకున్న వారంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ, చిన్ననాటి తీపి గుర్తులను నెమరవేసుకుంటూ రోజంతా ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. తమ పాఠశాలలో శిథిలమైన భవనాలను నాడు–నేడుతో తొలగించి నూతన భవనాలు నిర్మించడంతో తాము చదువుకున్న తరగతి గదులను గుర్తించలేకపోయారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించుకున్నారు.

పంచాయతీలకు ఆర్థిక సంఘ నిధుల విడుదల

అల్లవరం: మండలంలోని 21 గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం రెండో విడత బేసిక్ గ్రాంట్ రూ.52.21 లక్షల నిధులు విడుదలయ్యాయని ఎంపీడీఓ కృష్ణమోహన్ శనివారం తెలిపారు. ఈ నిధులను గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, తాగునీరు, పారిశుధ్య నిర్వహణకు ఖర్చు చేయవలసి ఉంటుందన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలి రండి



సామాజిక మహాశిల్పం కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్ వెంకటరావు తదితరులు

అల్లవరం: విజయవాడలోని స్వరాజ్య మైదానంలో ఈ నెల 19న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణకు వేలాదిగా తరలిరావాలని సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షులు సాధనాల వెంకటరావు శనివారం పిలుపునిచ్చారు. సామాజిక న్యాయ మహాశిల్పం కార్యక్రమంలో భాగంగా దేవగుప్తం సచివాలయం వద్ద శనివారం ఆయన అధ్యక్షతన సంతకాల సేకరణ నిర్వహించారు. కార్యక్రమంలో పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, కాశి బాలయోగి, చిట్టూరి వెంకటేశ్వరరావు, సాధనాల శ్రీను, పినమాల విక్రమ్, ఈతకోట రాజు, కార్యదర్శి పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి గ్రామ పంచాయితీ పరిధి బాలయోగి వారధి సమీపంలో రూ.12 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి శనివారం శంకుస్థాపన చేశారు. గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం గానుగ చెరువు ప్రాంతంలో ఈ రోడ్డును నిర్మిస్తున్నట్లు సర్పంచ్ ఊర్మిళాదేవి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, ఆశపు బుజ్జి, బళ్ల నాగసతీష్, కోలా ఏసు, బళ్ల సతీష్, ఉంగరాల నాగేశ్వరరావు, పెదపూడి రత్నం, కొల్లు లోకేష్, పుత్సల ఏసు, గొలకోటి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



విలసవిల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి

అభివృద్ధి పనులను అడ్డుకోవడం దారుణం

ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

యానాం: మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు యానాంను అభివృద్ధి చేయడానికి పోటీ పడాలే తప్ప అభివృద్ధి పనులను అడ్డుకుంటూ తనపై తప్పుడు ప్రచారాలు చేస్తుండటం దారుణమని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీమంత్రి మల్లాడి నియోజకవర్గ అభివృద్ధికి నిధుల సాధనలో తనతో పోటీపడాలని, అంతే తప్ప నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. నియోజకవర్గానికి ఎవరు మంచి చేస్తున్నారో నిర్ణయించేది ప్రజలేనని చెప్పారు. శాసనసభ్యుడిగా ప్రజల చేత ఎన్నుకోబడిన వ్యక్తిగా నియోజకవర్గానికి నష్టం కలిగించేలా ప్రవర్తించే ప్రశ్నే లేదన్నారు. డంపింగ్ యార్డు సమస్య, మత్స్యకారుల పరిహారం పంపిణీ తదితర సమస్యలపై తాను పోరాటం చేస్తున్నానన్నారు. ఎన్నో ఏళ్లుగా కనకాలపేటలో డంపింగ్ యార్డు సమస్య ఉన్నా గతంలో ఎవరూ పట్టించుకోలేదన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత క్లీన్ చేసి తరలించేలా టెండర్ ప్రక్రియ వరకూ తీసుకెళ్లానన్నారు. మత్స్యకారుల నష్టపరిహారం సొమ్ము సుమారు రూ.147 కోట్లకు పైగా రావాల్సి ఉందని రూ.26 కోట్లు మాత్రమే ప్రభుత్వ అకౌంట్‌లో పడ్డాయన్నారు. ఆ సొమ్ము తెప్పించేందుకు ప్రయత్నిస్తున్నామని, దళారీల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో పరిహారం వేయించడమే తన లక్ష్యమన్నారు.

ఘనంగా నక్షత్ర పూజలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామివారు

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి శ్రీభూసమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శనివారం ధనుర్మాసం, శ్రవణా నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో కె.కార్తీక్, వరదా రామచంద్రమూర్తి ఆధ్వర్యంలో పురోహితులు పెద్దింటి శ్రీనివాసాచార్యులు స్వామివారికి ఉదయం నుంచి అభిషేకాలు చేసి పూర్ణాహుతి జరిపారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, అన్నసమారాధన ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కవి సత్యనారాయణకు ఐకాన్ అవార్డు

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన కవి బీవీవీ సత్యనారాయణకు తిరుపతికి చెందిన మనం ఫౌండేషన్ నేషనల్ యూత్ ఐకాన్ అవార్డు–2024 అందజేసింది. మనం ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ కె.చక్రవర్తి నుంచి కవి సత్యనారాయణ ఆన్‌లైన్ ద్వారా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కవి సత్యనారాయణను శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జిల్లా గౌరవాధ్యక్షుడు రుద్రరాజు నానిరాజు, జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, బలరామమూర్తి అభినందించారు.

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు



డ్రైఫ్రూట్స్‌తో ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామివారు

తాళ్లరేవు: స్థానిక శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామికి పవిత్ర ధనుర్మాసం సందర్భంగా ఆలయ చైర్మన్ కొత్త సుభాష్ ఆధ్వర్యంలో అర్చకులు ఖండవిల్లి కేశవాచార్యులు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని మంచి గంధం, డ్రైఫ్రూట్స్‌తో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

35 టిన్నుల బెల్లం ఊట ధ్వంసం

తాళ్లరేవు: కోరంగి మడ అభయారణ్యం పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా కాస్తున్న నాటుసారా స్థావరాలపై అటవీ అధికారులు శనివారం దాడి చేశారు. ఐ.పోలవరం మండలం భైరవపాలెం ప్రాంతంలో నాటుసారా తయారు చేస్తున్నట్లుగా అందిన సమాచారం మేరకు ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఎస్వీ వరప్రసాదరావు నేతృత్వంలో బృందం దాడి చేసి నాటుసారా తయారీ కోసం 35 టిన్నుల్లో నిల్వ చేసిన బెల్లం ఊటను ధ్వంసం చేశారు. దీని విలువ సుమారు రూ.50 వేల వరకూ ఉంటుందని తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు యూనిఫాం పంపిణీ



పారిశుధ్య కార్మికులకు యూనిఫాం అందజేసిన సర్పంచ్ పెయ్యల మంగేష్ తదితరులు

తాళ్లరేవు: సంక్రాంతి పండగ నేపథ్యంలో కోరంగి పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు సర్పంచ్ పెయ్యల మంగేష్ ఒక్కొక్కరికి రెండేసి జతల చొప్పున యూనిఫాంను అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అర్ధాని రామరాజు, పెయ్యల శ్రీనివాస్, శ్రీను పాల్గొన్నారు.

రెడీమేడ్ భోగి పిడకలకు గిరాకీ



అమలాపురం గాయత్రి ఆలయం వద్ద అమ్మకానికి సిద్ధంగా ఉంచిన భోగి పిడకల దండలు

అలాపురం రూరల్: సంక్రాంతి శోభతో పల్లెలు కళకళలాడుతున్నాయి. సుదూర ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా స్వస్థలాలకు చేరడంతో పిల్లాపాపలు, బంధుగణంతో ఏ ఇల్లు చూసినా సందడిగా కనిపిస్తుంది. భోగి మంటలు వేసేందుకు కూడళ్లు సిద్ధమయ్యాయి. మంటల్లో వేసేందుకు భోగిపిడకలు తయారీలో చిన్నారులంతా నిమగ్నమయ్యారు. ఈసారి కోనసీమలో రెడీమేడ్ భోగి పిడకలు మార్కెట్‌లోకి వచ్చేశాయి. అమలాపురం ఎర్రవంతెన వద్ద రామానంద ఆశ్రమంలో నిర్వాహకులు దేశీయ ఆవు పేడతో భోగి పిడకలు చేసి దండ రూ.50కు అమ్ముతున్నారు. నల్లవంతెన, ఎర్రవంతెన వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాళ్లలో భోగి పిడకల దండ రూ.100కు విక్రయిస్తున్నారు. చిన్నారులతో భోగి మంటలో వేయించేందుకు భోగి పిడకల దండలు కొనుగోలు చేస్తుండడంతో వాటికి గిరాకీ ఏర్పడింది.

జగ్గన్నతోట తీర్థానికి సిద్ధమవుతున్న రుద్ర ప్రభలు



రుద్ర ప్రభను కడుతున్న పాలగుమ్మి గ్రామస్తులు

అమలాపురం రూరల్: సంక్రాంతిని పురస్కరించుకుని ఈ నెల 16న జరిగే జగ్గన్నతోట ప్రభల తీర్థం కోసం అమలాపురం రూరల్, అంబాజీపేట, అయినవిల్లి మండలాల్లోని 11 గ్రామాల పెద్దలు ఏకాదశ రుద్ర ప్రభలను సిద్ధం చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో పెద్దలు అత్యంత నేర్పుతో ప్రభలను కడుతున్నారు. మండలంలోని పాలగుమ్మిలో వేంచేసి ఉన్న శ్రీశ్యామలాంబ సమేత చెన్న మల్లేశ్వరస్వామి(మృత్యుంజయ రుద్రుడు) ఆలయం ఏకాదశ రుద్రుల్లో ఒకటి. ఈ గ్రామం, ఆలయం నుంచి స్వామి ప్రభ కనుమ రోజున అంబాజీపేట మండలం జగ్గన్నతోట జరిగే ఏకాదశ రుద్ర ప్రభల సరసన కొలువయ్యేందుకు ఊరేగింపుగా వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. పాలగుమ్మి గ్రామస్తులు గత మూడు రోజులుగా మృత్యుంజయ రుద్ర ప్రభను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. గ్రామానికి చెందిన బీఎస్ఎన్ఎల్ డీఈఈ పాలగుమ్మి పల్లంరాజు, గ్రామ పెద్దలు పాలగుమ్మి సత్య రామలింగేశ్వరస్వామి, భమిడిపాటి శ్రీరామ్, పాలగుమ్మి శ్రీరామ్ తదితరులు ప్రభను శాస్త్రోక్తంగా తయారుచేస్తున్నారు.

మినీ పార్కు నిర్మాణానికి రూ.4.90 లక్షల మంజూరు



చిట్టబ్బాయి సతీమణికి నిధుల మంజూరు పత్రాన్ని అందిస్తున్న ఎంపీ అనురాధ

అల్లవరం: అమలాపురం పోస్టాఫీస్ వద్ద మాజీ ఎమ్మెల్యే కుడుపూడి చిట్టబ్బాయి పేరు మీద మినీ పార్కు ఏర్పాటుకు ఎంపీ ల్యాండ్స్ నిధులు రూ.4.90 లక్షలను ఎంపీ అనురాధ మంజూరు చేస్తూ సంబధిత పత్రాలను చిట్టబ్బాయి సతీమణికి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ అనురాధకి చిట్టబ్బాయి కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

సామాజిక సమతా సంకల్పం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్ మంగేష్ తదితరులు

తాళ్లరేవు: గాడిమొగ పంచాయతీ కార్యాలయంలో సామాజిక సమతా సంకల్పం కార్యక్రమం సర్పంచ్ పెయ్యల మంగేష్ అధ్యక్షతన శనివారం జరిగింది. అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ఆవిష్కరణను పురస్కరించుకుని సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి సర్పంచ్ మంగేష్, ఎంపీటీసీ సభ్యురాలు పోతుల రత్నకుమారి, పంచాయతీ కార్యదర్శి అర్ధాని రామరాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెయ్యల శ్రీనివాస్, వార్డు సభ్యులు, దళిత నాయకులు సంతకాలు చేశారు.

ఘనంగా అయోధ్య ఉత్సవం



సీతారామ, ఆంజనేయ స్వామివార్లను ఊరేగిస్తున్న భక్తులు

అల్లవరం: మండలంలోని కొమరగిరిపట్నం పంచారామ క్షేత్రంలో కొలువైయున్న సీతారామచంద్రస్వామి, ఆంజనేయ స్వామివారి ఆలయంలో అయోధ్య ఉత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామచంద్ర, ఆంజనేయ స్వామివార్లను రథంపై గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఈ నెల 22న అయోధ్యలో జరిగే సీతారామలక్ష్మణ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా అదే రోజు ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకూ అభిషేకం నిర్వహిస్తామని ఆలయ కమిటీ తెలిపింది. పూజల్లో అల్లూరి సురేష్‌రాజు, మంతెన సీతారామరాజు, దాట్ల కృష్ణంరాజు, మంతెన సురేష్‌రాజు, రుద్రరాజు నానిరాజు తదితరులు పాల్గొన్నారు.

500 పోస్టులకు 20,154 మంది పోటీ

యానాం: పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్ రీజియన్లలో హోంగార్డు పోస్టులకు 20,154 మంది పోటీ పడుతున్నారని హోంమంత్రి నమశ్శివాయం తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని శాఖల్లోనూ పదివేల పోస్టుల భర్తీకి నిర్ణయించడమే కాకుండా ఇప్పటికే 1,200 పోస్టులు భర్తీ చేసిందన్నారు. 500 హోంగార్డు పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేస్తే 20,154 దరఖాస్తులు వచ్చాయని, వారికి ఫిబ్రవరి 1 నుంచి ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలు ఉంటాయన్నారు. డెక్ హోల్డర్స్‌తో పాటు 61 ఎస్ఐ, 200 కోస్టుగార్డుల పోస్టులను సైతం త్వరలో నియమిస్తామన్నారు. 286 ట్రైన్డ్ గ్రాడ్యుయేటెడ్ టీచర్లు, 67 లెక్చరర్ పోస్టులకు నోటిఫికేషన్ వచ్చిందన్నారు. మరో 40 లాంగ్వేజ్ టీచర్ పోస్టుల భర్తీకి ఎల్జీ ఆమోదానికి పంపినట్లు చెప్పారు. విద్యుత్ శాఖలో 177 కన్‌స్ట్రక్షన్ హెల్పర్ పోస్టులకు, 103 జూనియర్ ఇంజినీర్ పోస్టులను భర్తీ చేస్తామన్నారు.

పొంగల్ గిఫ్ట్ పంపిణీకి ఆమోదం

యానాం: యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి రీజియన్లలో 3,38,761 రేషన్ కార్డులకు పొంగల్ గిఫ్ట్ సొమ్ము మంజూరు చేసే ఫైలుకు ఎల్జీ తమిళిసై ఆమోదం తెలిపారని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ శనివారం తెలిపారు. ఒక్కో రేషన్ కార్డుకు రూ.500 చొప్పున మొత్తంగా రూ.16.93 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. దీనికి అదనంగా సివిల్ సప్లయిస్ శాఖ ద్వారా మరో రూ.250 రేషన్ కార్డుదారులకు ఇవ్వాలని సీఎం రంగసామి నిర్ణయించి ఆదేశాలు జారీచేశారన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి నిధులు కేటాయించండి

దేవదాయ శాఖ మంత్రిని కోరిన ఎంపీ అనురాధ



దేవదాయ శాఖా మంత్రి సత్యనారాయణతో మాట్లాడుతున్న ఎంపీ చింతా అనురాధ

అల్లవరం: తుమ్మలపల్లిలోని లక్ష్మణేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.75 లక్షల నిధులు కేటాయించాలని దేవదాయ శాఖా మంత్రి కొట్టు సత్యనారాయణను ఎంపీ చింతా అనురాధ కోరారు. తాడేపల్లిగూడెంలో మంత్రి కొట్టు సత్యనారాయణను ఎంపీ చింతా అనురాధ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. అల్లవరం మండలం తుమ్మలపల్లి పంచాయతీ పరిధిలోని లక్ష్మణేశ్వరంలో కొలువైయున్న పార్వతీ సమేత లక్ష్మణేశ్వరస్వామి వారి ఆలయం శిథిలావస్థకు చేరిందని, ఆలయాన్ని పునర్నిర్మించి పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. ఆలయంలో నిత్య పూజలు, స్వామివారి కైంకర్యాది ధార్మిక కార్యక్రమాలు నిర్వహించేలా చూడాలని కోరారు. దీనిపై దేవాదాయ శాఖ మంత్రి సత్యనారాయణ సానుకూలంగా స్పందించారని ఎంపీ అనురాధ తెలిపారు.